ఈనాడు
యాదాద్రి భువనగిరి
మంగళవారం అక్టోబరు 8, 2024

బడి.. ఇక బలోపేతం



ప్రభుత్వ పాఠశాల

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

మండల విద్యాధికారులు నియామకంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మెరుగుపడనుంది. పాఠశాలలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లోపించడంతో నిర్వహణ ఇబ్బందులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏకీకృత సర్వీసు నిబంధనలు, కోర్టు కేసులతో నేటికీ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సిన మండల విద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 17 మండలాలకు 17 మంది పూర్తిస్థాయి మండల విద్యాధికారులు ఉండాల్సి ఉండగా జిల్లాలో ముగ్గురు పూర్తిస్థాయి మండల విద్యాధికారులు పనిచేస్తుండటం గమనార్హం. గత కొద్ది రోజుల క్రితం అన్ని మండలాలకు మండల విద్యాధికారులుగా పూర్తి అదనపు బాధ్యతలతో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించడంతో విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ పెరిగి బలోపేతం కానుంది.

గణాంకాలు ఇలా...	
మండలాలు:	17
ప్రభుత్వ పాఠశాలలు:	712
ఉపాధ్యాయుల సంఖ్య:	3,497
విద్యార్థుల సంఖ్య:	38,277

సర్కారు బడులు...

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెరగనుండటంతో విద్యాశాఖ అమలు చేయనున్న కార్యక్రమాలతో పాటు బోధన పటిష్ఠంగా కొనసాగనుంది. గతంలో 17 మండలాలకు ముగ్గురే మండల విద్యాధికారులు ఉండటంతో ఉపాధ్యాయుల హాజరుపై పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా నిర్వహణ కొనసాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఎంఈవోలుగా పనిచేసిన కృష్ణ ఆరు మండలాలకు, శ్రీధర్ ఆరు మండలాలకు, నాగవర్ధన్‌రెడ్డి ఐదు మండలాలకు ఎంఈవోలుగా కొనసాగారు. ప్రస్తుతం ముగ్గురు పూర్తిస్థాయి ఎంఈవోలతో పాటు మరో 14 మందిని మండల నోడల్ అధికారులుగా, ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలల నిర్వహణ బలోపేతం కానుంది. విద్యాప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

మెరుగుపడనున్న పాఠశాలల నిర్వహణ

– భాస్కర్, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఎంఈవోల నియామకంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. ఎప్పటికప్పుడు ఎంఈవోలు అందిస్తున్న సూచనలు, సలహాలతో పాఠశాల నిర్వహణ మెరుగుపర్చే అవకాశం ఉంది. పదోన్నతులు కల్పించి పూర్తిస్థాయి ఎంఈవోల నియామకం చేపట్టిన పక్షంలో ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది.

యాదాద్రిలో మహాలక్ష్మి అలంకారం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో దేవస్థానం చేపట్టిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజుకు చేరుకున్న సందర్భంగా సోమవారం అలంకార వేడుక, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజల్లో ప్రాతఃకాల ఆరాధన, పారాయణం, లలిత సూక్త నామార్చన జరిపారు. మధ్యాహ్నం నీరాజన మంత్ర పుష్పం చేపట్టారు. సాయంత్రం శ్రీ దేవీ నవావరణ పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. శివాలయంలో మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వపత్రాలతో ఆరాధన నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతం చేపట్టిన ఆలయ పూజారులు శివ, పార్వతులను హారతితో కొలిచారు. స్ఫటిక రామలింగేశ్వరస్వామికి అభిషేకం జరిపారు. శివ, పార్వతుల కల్యాణం, సేవోత్సవాలను నిర్వహించారు.



ఇక పాలు పొంగించడమే..!

★ ఉమ్మడి జిల్లాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు 5,511

★ రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం కసరత్తు


నల్గొండలో పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకగదుల సముదాయం

ఈనాడు, నల్గొండ:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకొని ప్రస్తుతం వృథాగా ఉన్న రెండు పడకగదుల ఇళ్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆవాసానికి సిద్ధంగా ఉన్న 5,511 ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఈ నెలాఖరులోపు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించగా..ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాలకు 38,500 ఇళ్లు, నాగార్జునసాగర్‌కు ప్రత్యేకంగా 5 వేల ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి ఇటీవల నెల్లికల్ పర్యటన సందర్భంగా వెల్లడించారు.

★ రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులపై ఇప్పటికే అధికార యంత్రాంగం సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. ఈ నివేదికల ఆధారంగా సర్కారు ఓ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 17,199 ఇళ్లు మంజూరు చేయగా నాగార్జునసాగర్, ఆలేరుల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ పథకంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొత్తం 6,391 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా..ఇందులో సూర్యాపేట నియోజకవర్గంలో మాత్రమే 880 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. దేవరకొండ, నల్గొండ నియోజకవర్గాల్లో


"సాధ్యమైనంత తొందరలో రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. అవసరమైతే దసరాలోపే ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు సైతం ఈ నెలాఖరులోపు అర్హులను ఎంపిక చేస్తాం.. ఇటీవల సమీక్ష సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది..

ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లయింది.

★ నల్గొండ పురపాలిక పరిధిలో 540 ఇళ్లను నిర్మించగా..అవి లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అవి రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతున్నాయి. యాదాద్రి జిల్లాలో 829 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా.. ఇప్పటి వరకు ఒక్క ఇంటినీ లబ్ధిదారులకు కేటాయించలేదు. సరైన సమయంలో బిల్లులు రాకపోవడం, గుత్తేదారులు పనులు చేయడానికి ఆసక్తి చూపకపోవడం తదితర కారణాలతో నకిరేకల్, మిర్యాలగూడ, తిప్పర్తి లాంటి ప్రాంతాల్లో నిర్మాణాలు 50, 60 శాతం పూర్తయి నిలిచిపోయాయి.

ఇందిరమ్మ కమిటీల ద్వారానే..

ప్రతి నియోజకవర్గానికి కేటాయించే 3500 ఇళ్లకు అర్హులను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల ద్వారానే ఎంపిక చేయాలని సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ఇందిరమ్మ కమిటీలను దసరాలోపు నియమిస్తారా? లేదా అనంతరమా? అన్నది తేలాల్సి ఉంది.


★ గతేడాది రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారులను డ్రా పద్ధతిలో కేటాయించగా...ఇప్పుడు వారికే అప్పగిస్తారా లేదా అన్నదీ ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ఈ ఏడాది జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణీల్లోనూ ఎక్కువ దరఖాస్తులు ఇళ్లు కావాలనే వస్తుండటం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఇవే అత్యధికంగా ఉన్నాయి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ దసరాలోపు ఓ నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతుండటంతో అర్హుల్లో ఆశలు మొదలయ్యాయి.

గణాంకాలు

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	50 శాతం కంటే ఎక్కువ నిర్మాణమైనవి	లబ్ధిదారులకు అందజేసినవి
నల్గొండ	8155	2476	3542	185
సూర్యాపేట	5424	3086	1986	695
యాదాద్రి	3620	829	1270	0

వైభవంగా స్వయంభువుల కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో సోమవారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ ఆస్థాన, ఆశ్రిత పూజలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. వేకువజామున సుప్రభాతం నిర్వహించిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి, నారసింహ ఆర్జామూర్తులను హారతితో కొలిచారు. అనంతరం నిజాభిషేకం నిర్వహించారు. తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ సువర్ణ పుష్పార్చన చేశారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థమై శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణ మూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాలు, మంత్ర పఠనంతో చేపట్టారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దార్బర్ సేవోత్సవంలో నిత్య ఆదాయాన్ని వెల్లడించారు. వివిధ విభాగాల నుంచి రూ. 18,79,262 చేకూరింది.


శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు, తిలకిస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

రైతేరాజు 8లో..

సర్వే ఎలా సాగుతోంది..!



యాదగిరిగుట్ట మండలం జంగపల్లి గ్రామాన్ని కలెక్టర్ హన్మంత్ కె. జెండగే సోమవారం ఆకస్మికంగా సందర్శించి.. కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాల పేర్లను నమోదు చేయాలని సూచించారు. నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎంపీడీవో నవీన్ కుమార్, ఎంపీవో సలీం, అధికారులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట అర్బన్

ఆలేరు వాగుకు గోదావరి నీరు

ఆలేరు పెద్దవాగు గోదావరి జలకళను సంతరించుకుంది. వారం రోజుల క్రితం మల్లన్నసాగర్ నుంచి బస్వాపూర్ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నీటిలో


ఆలేరు-కొలనుపాక మధ్య పెద్ద వాగు కాజ్‌వే మీదుగా నీటి ప్రవాహం

కొంత భాగాన్ని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి వద్ద కాలువ ద్వారా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువులోకి వదిలారు. దీంతో వారం రోజులుగా గంధమల్ల చెరువు నిండి అలుగుపోస్తుంది. ఈ ప్రాంతం ఆలేరు వాగుకు అనుసంధానంగా ఉండడంతో వాగు గోదావరి జలాలతో ప్రవహిస్తోంది. ఫలితంగా వాగు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ బావులు, బోర్లలోకి నీరు చేరుతోంది. రాజపేట మండలం బేగంపేట నుంచి గుండాల మండలం వరకు విస్తరించి ఉన్న ఆలేరు(బిక్కేరు) వాగుపై పలుచోట్ల నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నీటితో నిండుకుంటున్నాయి. దీంతో యాసంగిలో వరిసాగు పెరిగేందుకు అవకాశం ఉందని రైతులు అంటున్నారు. – న్యూస్‌టుడే, ఆలేరు

విరాళాల సేకరణ-వాహన పూజలకు ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో దాతల నుంచి విరాళాల సేకరణ కోసం ప్రత్యేక విభాగాన్ని నిర్మించింది. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నిర్వహించే నిత్యాన్న ప్రసాదం, శాశ్వత కైంకర్యాలు, కాటేజీ, గదుల నిర్మాణం కోసం భక్త దాతలు సమర్పించే విరాళాలను సేకరించేందుకు దేవస్థానం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. దాతలకు అందుబాటులో ఉండేందుకు ఆలయ సన్నిధిలోని మాడ వీధిలో లిఫ్ట్, రథశాల మధ్య విరాళాల సేకరణ విభాగాన్ని నిర్మించారు. సదరు విభాగాన్ని త్వరలో అందుబాటులోకి తేనుంది. ఇక కొండ కింద ఆధ్యాత్మికవాడ సమీపాన యాగ స్థలంలో వాహన పూజల నిర్వహణ కోసం ప్రత్యేక షెడ్ నిర్మితమైంది. రాష్ట్రంలో పేరొందిన ఈ క్షేత్ర సందర్శ కోసం వచ్చే యాత్రికులు తమ వాహనాలకు దేవుడి ఆశీస్సులకై పూజలు నిర్వహిస్తారు. ఆ మేరకు ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేసిన ఆలయ నిర్వాహకులు త్వరలోనే సదరు షెడ్‌ను వినియోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


వాహనాల పూజ కోసం ఏర్పాటైన షెడ్

టీసేఫ్ యాప్‌పై మెడికోలకు అవగాహన

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులు, మెడికోలకు వ్యక్తిగత భద్రతపై రాచకొండ పోలీస్ కమిషనరేట్ షీటీం ప్రతినిధులు సోమవారం అవగాహన కల్పించారు. సేఫ్టీ ట్రాకింగ్ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపయోగించే విధానంపై వివరించారు. ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ.. మహిళలు, యువతులపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. టీసేఫ్ యాప్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ సంగీత, డాక్టర్ మృదుల, వైద్యులు అపర్ణ, లక్ష్మీజ్యోతి, కల్పన, శ్యామలా అయ్యర్ పాల్గొన్నారు.

ఒక్కేసి.. పువ్వేసి సందమామ.. ఒక్కచోటచేరి సందమామ

చౌటుప్పల్‌లోని లయన్స్ భవనంలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

★ అఖిల భారత పద్మశాలి అన్నసత్రం ఆధ్వర్యంలో సోమవారం యాదగిరిగుట్టలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వేడుకలో పాల్గొని బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేశారు. సత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, దీకొండ జోగయ్య, ఎర్రగుంట్ల వెంకటేశం, కైరంకొండ సుధీర్, నిర్మల, లక్ష్మీ, వసంత, సరస్వతి, మాధవి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్, యాదగిరిగుట్ట పట్టణం


చౌటుప్పల్‌లో..


యాదగిరిగుట్టలో..

ధాన్యం ఉందా.. ధనమై పోయిందా..!

☐ సీఎంఆర్ బియ్యం పెట్టని మిల్లుల్లో తనిఖీలు


హుజూర్‌నగర్: ఓ మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన్యం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయి ఉన్న మిల్లుల్లో అధికారుల తనిఖీ మొదలయ్యాయి. వారు ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యానికి సరిపడా మిల్లుల్లో ధాన్యం ఉందా, లేదా అన్న విషయంపై అధికారులతో తనిఖీ చేయించేందుకు ఎఫ్‌సీఐ నిర్ణయించింది. ఈ నెల పదిలోగా లెక్కలు తేల్చాలని ఎఫ్‌సీఐ నిర్ణయించి తనిఖీలు ప్రారంభించింది. ఈ మేరకు ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసేందుకు ఏడుగురు ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా ఆయా మిల్లుల్లో ధాన్యం నిల్వల లెక్కలు తేల్చనున్నారు. లెక్కలు తేలిన తరువాతే సీఎంఆర్ బియ్యం సేకరణలు తిరిగి ప్రారంభించాలని ప్రాథమికంగా ఎఫ్‌సీఐ నిర్ణయించింది.

★ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడుగురు అధికారులను నియమించారు. చిట్యాల, నకిరేకల్‌కు ఒకరిని, నల్గొండ, దేవరకొండకు మరొకరిని నియమించారు. హాలియా, మిర్యాలగూడ కేంద్రాలకు ఒకరిని, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కేంద్రాలకు ఒక అధికారిని నియమించారు. కోదాడకు ప్రత్యేకంగా ఒకరిని నియమించారు. సూర్యాపేట, తిరుమలగిరి కేంద్రాలకు ఒక అధికారిని, యాదాద్రి, భువనగిరి ప్రాంతాలకు ఒకరిని నియమించారు. ఈ ఏడుగురు అధికారుల ఆధ్వర్యంలో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి రావాల్సిన బియ్యానికి సంబంధించి అసలు ధాన్యం ఉందా లేదా అన్న విషయంపై యుద్ధ ప్రాతిపదికన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

చర్యలు తీసుకునే అవకాశం..

ఎన్ని సార్లు గడువు పెంచినా మిల్లర్లు సీఎంఆర్ బకాయిలు ఇవ్వడం లేదు. ఇప్పటికే కొంత మంది మిల్లర్లు ఉన్న ధాన్యం అమ్ముకొని దాటవేత ధోరణితో ఉన్నారని అధికారులు గుర్తించారు. సీఎంఆర్ ధాన్యం మిల్లుల్లో ఏ స్థాయిలో ఉందో తనిఖీలలో ఈసారి కచ్చితంగా లెక్కలు తేలుతాయన్న నమ్మకంతో అధికారులు ఉన్నారు. గతంలోనూ మిల్లుల్లో లెక్కలు తేల్చాలని నిర్ణయించినా తమ మిల్లుల్లో ధాన్యం లెక్కించే విధంగా లేదని, రకరకాల కారణాలు చెప్పి దాటవేశారు. ఈసారి అలా జరగకుండా ఎలా ఉన్నా ధాన్యాన్ని అధికారులు లెక్కించి ఒక నిర్ణయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈసారి మిల్లుల్లో ధాన్యం లేని మిల్లర్లపై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు 21-09-2024 నాటికి (మె.టన్నుల్లో)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

కుమారుడికి ఉరేసి.. తల్లి ఆత్మహత్య

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: ముక్కుపచ్చలారని కన్నకొడుకుని ఊపిరాడకుండా ఉరేసి తాను ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారకమైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పెద్ద రావులపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జడల రాజు అదే గ్రామానికి చెందిన జడల సోని(30)ని 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు పెళ్లిళ్ల శుభకార్యాలలో డెకరేషన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం రాజు పని నిమిత్తం బయటకు వెళ్లగా తల్లిదండ్రులు చిన్నరావులపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోని పెద్దకుమారుడిని ఆడుకోమని చెప్పి బయటకు పంపింది. చిన్న కుమారుడు జడల రియాన్ష్(6)ను బెడ్‌రూంలోకి తీసుకెళ్లి గడియ వేసుకుంది. మొదట కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపి అనంతరం ఆమె చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకొని ఇంటికి వచ్చిన భర్త తలుపులు బాదినా తీయకపోవడంతో పగులగొట్టి ఇంట్లోకి వెళ్లగానే విగత జీవులుగా కనిపించడంతో అరుపులు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారువచ్చి చూడటంతో అప్పటికే మృతిచెంది ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోని నాలుగు నెలలుగా మానసిక వేదనకు గురవుతోందని ఆసుపత్రుల్లో సైతం చూపిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


తల్లి సోనితో రియాన్ష్

సాగులో సాంకేతిక సాయం



త్రిపురారం మండలం బాబుసాయిపేటలో డ్రోన్‌తో మందులు పిచికారీ చేయిస్తున్న రైతు

త్రిపురారం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో యాంత్రీకరణ రోజురోజుకు పెరుగుతుంది. అందులో కూలీల కొరత, వారికున్న డిమాండ్, ఖర్చులు విపరీతంగా పెరుగుతుండడంతో గమనించిన నల్గొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన గోపగాని హరిప్రసాద్, శివనారాయణలు రూ.5.20 లక్షల వ్యయంతో బ్యాటరీతో నడిచే డ్రోన్‌ను కొనుగోలు చేసి పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. డ్రోన్‌తో ఎకరం పొలంలో 5 నుంచి 10 నిమిషాలలోపు మందులను పిచికారీ చేయవచ్చు. దీని వల్ల రైతులకు సమయం ఆదాతో పాటు, ఖర్చులు తగ్గుతాయి. దీంతో పరిసర గ్రామాల రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువులు చల్లడానికి ఆసక్తి కనబర్చుతున్నారు. కంపసాగర్ కేవీకే వారు సైతం రైతులు ముందుగా సమాచారం ఇస్తే డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది

- గోపగాని చిననర్సయ్య, త్రిపురారం



ప్రస్తుతం ట్రాక్టర్ సాయంతో పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల ఎకరాకు రూ.800 వరకు ఖర్చు కాగా యంత్రంతో రూ.400 నుంచి రూ.500 తోనే అయిపోతుంది. ఈ విధానం వల్ల మందు వృథా కాదు. కూలీల కొరతను అధిగమించవచ్చు.

రైతేరాజు

ఎత్తు మడుల పద్ధతిలో వేరుసెనగ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వేరుసెనగ సాగుచేసే రైతులు ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు.



వేరుసెనగను విత్తుకోవడానికి ఇదే సరైన సమయం. నవంబరు పక్షం వరకు వేసుకోవచ్చు. కాండం కుళ్లు తెగులు ఆశించకుండా ముందస్తుగా విత్తనశుద్ధి చేసుకోవాలి. కొత్తగా సాగుచేసే రైతులు ఎకరానికి సరిపడా విత్తనానికి 250 గ్రాముల రైజోబియం అనే జీవన ఎరువుతో విత్తన శుద్ధిచేయాలి. కొత్తగా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకుంటే కాయలు ఎక్కువగా వచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చు. 120 సెం.మీ. ఎడంగల 15 సెం.మీ. ఎత్తుమడులు 30 సెం.మీ. ఉండే కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి మడి మీద 30 సెం.మీ. దూరంలో నాలుగు వరుసల్లో వేరుసెనగ విత్తుకోవాలి. లేదంటే ట్రాక్టర్‌తో నడిచే బ్రాడ్ బెడ్ ప్లాంటర్‌తో విత్తుకోవచ్చు.

సౌరశక్తితో.. సర్వ ప్రయోజనాలు

చందంపేట, న్యూస్‌టుడే: పంటలను కాపాడుకునేందుకు రైతులు విభిన్న ప్రయత్నాలు చేస్తున్నా.. చివరికీ దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందేందుకు కొందరు రైతులు సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బుడ్డోనితండాకు చెందిన రైతు బాలు ఇటీవల నల్గొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు హాజరయ్యాడు. పత్తి పంటలకు సోకే తెల్ల, పచ్చదోమ, వివిధ రకాల పురుగుల నుంచి కాపాడుకునేందుకు రూ.4500 వ్యయంతో సోలార్ ట్రాప్స్‌ను కొనుగోలు చేశాడు. ఈ పరికరం రెండెకరాల వరకు పంటను నాశనం చేసే పురుగులను నివారిస్తుందని తెలిపారు. హాని చేసే పురుగులు సాయంత్రం 8 నుంచి 12 గంటల వరకు, ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సంచరిస్తాయి. ఆ సమయంలో సోలార్ ట్రాప్‌కు అమర్చిన గిన్నెలో వెలుతురుకు పురుగులు వచ్చి అందులో పడి చనిపోతాయి. మిగతా సమయంలో సోలార్ ట్రాప్ వెలుగులు దానంతట అవే ఆగిపోతాయి. ఈ పరికరంతో పంటకు పిచికారీ చేసే అవకాశం కొద్దిగా తగ్గుతుందని రైతు పేర్కొన్నారు.



బుడ్డోనితండా సమీపంలో పొలంలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్

పత్తిలో పూత, కాయ రాలడం నివారణ

త్రిపురారం: పత్తిలో అధిక వర్షాల కారణంగా పూత, కాయ రాలడం దాని నివారణపై కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాస్‌రావు తెలియజేశారు. పత్తిలో ప్రతికూల పరిస్థితుల వల్ల మొక్కల జీవన ప్రక్రియలో మార్పు వల్ల, అధిక వర్షాల వల్ల పూత, పిందె రాలడం జరుగుతుంది. అధిగమించడానికి నాఫ్తలిన్, ఎసిటిక్ యాసిడ్ 10 పీపీఎమ్ ద్రావణాన్ని విడిగా, 1 మి.లీ. డైఅమ్మోనియం ఫాస్ఫేట్ ద్రావణంతో కలిపి ఒకటి, రెండుసార్లు 10, 15 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలి. సైకోసిల్ 60 పీపీఎమ్ పిచికారీ చేయడం ద్వారా కూడా పూత, పిందె రాలడాన్ని అధిగమించవచ్చు. కాయ కుళ్లు తెగులు లక్షణాలు కాయలపై పెద్ద వ్యాప్తి చెందిన మచ్చలు ఏర్పడతాయి. మచ్చల మధ్యలో గులాబీ రంగులో ఉండే స్పోర్‌మాస్ ఉంటుంది. పత్తి మొక్క అన్ని భాగాలను, పెరుగుదల యొక్క ఏదైనా దశలోనైనా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి ఎక్కువగా ఉన్నప్పుడు కాయలు కుళ్లి పోతాయి. దీని నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 1 మి.లీ., కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులను 30 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.



సమస్య - సమాధానం

? యాసంగిలో వేరుసెనగ విత్తే సమయం తెలపగలరు. -కృష్ణయ్య, నల్గొండ

సమాధానం: తెలంగాణ ప్రాంతంలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు 30 వరకు విత్తుకోవచ్చు. అనుకూలమైన విత్తే రకాలు కదిరి- 6, 9 అనంత, ధరణి టీవీజీ-24, జేఎల్- 24, జేసీసీ-110 వేరుసెనగను అక్టోబరు 15 లోపు విత్తడం ద్వారా పురుగుల, చీడ పీడల ఉద్ధృతి నివారించవచ్చు.

? ఆయిల్ పామ్‌లో కొమ్ము పురుగు లక్షణాలు, నివారణ చర్యలు తెలపండి. -బాలునాయక్, దేవరకొండ

సమాధానం: ఆకుల చివర ఏ ఆకారంలో ఖాళీలు ఏర్పడతాయి. ఆకుల మొదళ్ల మీద శాశ్వత రంధ్రాలు ఏర్పడి వాటి నుంచి పిప్పి బయటకు కనిపిస్తుంది. నివారణకు పునరుత్పత్తి ప్రదేశాలను నాశనం చేయాలి. సూది మొనగల ఇనుప ఊచను మొవ్వ వద్ద కన్నంలో దూర్చి లోపల పెంకు పురుగులను బయటకు తీసి చంపాలి. పులిసిన ఆముదపు పిండి, లింగాకర్షక ఎరల ద్వారా పెద్ద పురుగులను పట్టి చంపవచ్చు.

? యాసంగిలో అనువైన వరి రకాలు, విత్తే సమయం గురించి తెలపగలరు. -శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి

సమాధానం: డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు వరి పంటను రైతాంగం సాగు చేస్తుంటారు. యాసంగిలో అనువైన రకాలు శోభిని ఆర్ఎన్ఆర్-2354, రాజేంద్ర ఆర్ఎన్ఆర్-12329, జేజీఎల్- 1118, ఎర్రమల్లెలు, డబ్ల్యూజీఎల్-20471. జనవరి మొదటి వారంలో నాట్లను వేసుకోవాలి.

త్రిపురారం, న్యూస్‌టుడే:

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్:



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

77025 44771

బడిపిల్లలే భూసారథులు



భూసార పరీక్ష కిట్ గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటంతో భూసారం దెబ్బతింటోంది. దీనిపై అన్నదాతలకు అవగాహన కలిగిస్తే జరుగుతున్న నష్టాన్ని నివారించవచ్చు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువ శాతం రైతు కుటుంబాల నుంచి వచ్చినవారే. వారికే నేల ఆరోగ్యం, పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తే.. వారి ద్వారా రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ విద్యా సంవత్సరంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టును చేపట్టింది. దేశవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో నల్గొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక పాఠశాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. పాఠాలు వినే బడి పిల్లలే స్వయంగా రైతు భూముల నుంచి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. వాటి ఫలితాలను రైతులకు అందజేస్తారు. ఏ ఎరువు, ఎంత మోతాదులో వేయాలో వ్యవసాయాధికారులు వారికి శిక్షణ ఇస్తారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు పాఠాలు..

ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థుల పేర్లతో ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేసుకొని అందులో నమోదు చేయాలి. మట్టి నమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, ఫలితాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. 7, 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థుల్లో 50 మందిని ఎంపిక చేసుకొని, నాలుగైదు బృందాలుగా ఏర్పాటు చేసుకోవాలి. మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ, తదితర వాటి గురించి విద్యార్థులకు స్థానిక భూసార పరీక్ష కేంద్రం అధికారులు శిక్షణ ఇస్తారు. మట్టి నమూనాల నుంచి ఫలితాల వరకు విద్యార్థులు స్వయంగా పని చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం భూసార పరీక్ష కిట్‌ను సరఫరా చేసింది. పాఠశాలకు దగ్గరలో ఉండే పంట పొలాల నుంచి వానాకాలం, యాసంగి కలిపి 50 నమూనాలు సేకరించి, వాటిని పరీక్షించి, ఫలితాలు రైతులకు అందించాల్సి ఉంటుంది.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవే..

నల్గొండ జిల్లాలో స్థానిక కేంద్రీయ విద్యాలయంతో పాటు చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం ఎంపిక చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాయగిరి జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపిక చేయగా.. సూర్యాపేట జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేకపోవడంతో పాఠశాలలను ఎంపిక చేయలేదు.

రైతులకు ఉపయోగం..



లోహిత, కేంద్రీయ విద్యాలయం, నల్గొండ

భూసార పరీక్షల ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుంది. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేస్తే ఖర్చు తగ్గుతుంది. అనవసరంగా ఎరువులు వేయడం తప్పుతుంది. అధిక దిగుబడులు సాధించవచ్చు. దీనిపై రైతులను చైతన్యం చేస్తాం.

ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి

పాల్యాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ తదితర వాటిపై శిక్షణ ఇచ్చాం. పాఠశాలల వారీగా కిట్లు సరఫరా చేశాం. విద్యార్థులకు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం.

భారాస నాయకులు నివాసం ఉంటే తెలుస్తుంది: మంత్రి

దేవరకొండ, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాలకు రాని కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష హోదాలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారా.. అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. నల్గొండ జిల్లా దేవరకొండ పురపాలికలోని స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన



దేవరకొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బాలు నాయక్, తదితరులు

ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో ప్రస్తుత ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను ఓడించేందుకు దేవరకొండకు వచ్చిన కేసీఆర్ నక్కలగండి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానని చెప్పి, నేడు ఫాంహౌజ్ నుంచి బయటకు రావడం లేదని ఆరోపించారు. మూసీ వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారని.. వారిని రక్షించేందుకు తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు చర్యలు చేపడుతుంటే హరీశ్‌రావు, కేటీఆర్‌లు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. భారాస నాయకులు అక్కడ నివాసం ఉంటే అక్కడి కష్టాలు తెలుస్తాయన్నారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జూలూరు ధనలక్ష్మి, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

నార్ముల్ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం..

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ (నార్ముల్ డెయిరీ)కు పూర్వవైభవం తెచ్చేందుకు శతవిధాలుగా కృషిచేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అభినందన సభకు ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, డీసీసీ ఛైర్మన్ సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. డెయిరీని లాభాలబాట పట్టించేందుకు అన్నిరకాల చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాలో విజయ డెయిరీకి బదులుగా ప్రభుత్వ ఆస్పత్రులు, వసతిగృహాలు, ఆలయాల్లో నార్ముల్ డెయిరీ పాలు, నెయ్యి వినియోగించేలా చూస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మంత్రి వెంకట్‌రెడ్డి

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తుపాకీ పేల్చి అండర్-20 బాలుర 800 మీటర్ల పరుగు ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ప్రకృతి ప్రేమికులు.. వ్యవసాయ శ్రామికులు

ప్రకృతి సాగు చేస్తూ, పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు పంపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నడిగూడెం మండలానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, రామారావు. - నడిగూడెం, న్యూస్‌టుడే:

గో ఆధారిత సాగు..

నారాయణపురం గ్రామానికి చెందిన **నాగిరెడ్డి వెంకటరెడ్డి** తనకున్న నాలుగెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు సుభాష్ పాలేకర్ వద్ద రెండుసార్లు శిక్షణ పొందారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత సాగు చేపట్టారు. వరి, వేరుసెనగ, కంది, పెసర, పసుపు, ఉలవ, ఉల్లి పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలను సహజసిద్ధంగా పండిస్తున్నారు. - భూసారం పెంపొందించేందుకు తృణధాన్యాలు సాగు చేస్తున్నారు. విత్తనాభివృద్ధికి దేశీ వరి రకాలను సాగు చేస్తూ, ఇతర రైతులకు విత్తనాలు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. పంటల్లో చీడపీడల నివారణకు జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహస్తం, దశపర్ణి, వేప కషాయం, బీజామృతం, మట్టి ద్రావణాలు సిద్ధం చేసుకొని భూసారాన్ని పెంపొందించుకుంటున్నారు. ప్రకృతి సాగులో దిగుబడి తక్కువగా ఉన్నా, మార్కెట్‌లో రెట్టింపు ధర లభిస్తుండటంతో గిట్టుబాటు అవుతుందన్నారు.



కషాయాలు తయారు చేసి..

సేంద్రియ సాగుపై ఆసక్తి, మందుల్లేని ఆహారం తీసుకోవాలనే సంకల్పంతో తమకున్న ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు రత్నవరం గ్రామానికి చెందిన **రామారావు.** గత రెండు సీజన్ల నుంచి సేంద్రియ సాగు చేస్తున్నారు. క్రిమిసంహారక మందు వాడకుండా చీడపీడల నివారణకు కషాయాలు పిచికారీ చేస్తున్నారు. కషాయాలు సైతం తమ క్షేత్రంలో తామే తయారు చేస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన బియ్యాన్నే తాము ఆహారంగా తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్‌లో కమతాల సాగు పెంచి సేంద్రియ ఉత్పత్తులను ఇతరులకు సరఫరా చేస్తామన్నారు.



క్రిమి సంహారక మందులు వాడకుండా..

చనుపల్లి గ్రామానికి చెందిన **ఏలేటి వెంకటేశ్వరరెడ్డి** ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో దేశవాళీ వరి వంగడాలను సాగు చేశారు. క్రిమి సంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు. పండించిన ధాన్యం మరపట్టించి కోదాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, జబల్‌పూర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కిలో బియ్యం రూ.110లు, 25 కిలోల బస్తా 2,600 వరకు విక్రయిస్తున్నట్లు వివరించారు.



ఎక్కటి శిల్పం గుర్తింపు

గుండాల, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామ శివుని బండపై పొడవైన జడతో ఉన్న వీరుడి శిల్పాన్ని గుర్తించినట్లు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వెల్మజాల వద్ద ఉన్న వీరుడి శిల్పం భుజాలకు దండ కడియాలు, నడుముకి కత్తి, కాళ్లకు కడియాలు ధరించి, గోచి కట్టి ఉండి, ఛాతి భాగంలో ఏ ఆచ్ఛాదన లేదని వివరించారు. ఎడమ చేతితో విల్లు పట్టుకుని, కుడిచేతితో బాణం సంధిస్తున్నట్లు శిల్పం ఉందన్నారు. కత్తి, విల్లు మొదలైన ఆయుధాలతో పోరాడే వీరులను 'ఎక్కటి' అని పిలుస్తారని తెలిపారు. శిల్పంలోని వీరుడి ముఖ ముందు భాగం, బాణం మధ్యలో తెలుగులో రెండు వరుసల్లో రాసిన శాసనం ఉందని చెప్పారు. భారత పురావస్తు శాఖ ఎపిగ్రఫిస్ట్‌కు సమాచారం ఇవ్వడంతో కొంత సమాచారం తెలిసిందని. వీరుడు 13వ శతాబ్దానికి చెందిన వాడని, కలబడు వంటి పదాలు ఉన్నాయని, దీని ద్వారా అప్పట్లో జరిగిన యుద్ధంలో కలబడినట్లుగా తెలుస్తోందని వివరించారు. ఇలాంటి శిల్పాలను వీరగల్లు అంటారని వెల్లడించారు. రాష్ట్ర కూట పాలకుడు సామాన్య శకం 907 రెండో కృష్ణుని కాలం నాటి శాసనం గ్రామంలోని పోచమ్మ గుడి ముందు ఒకటి, పాటిగడ్డ మీద రాష్ట్ర కూటుల కాలం నాటి మరో రెండు భారీ శాసనాలు ఉన్నాయని వివరించారు. పరిశోధనలో మాజీ సర్పంచి సుబ్రహ్మణ్య ప్రసాద్, సుధీర్, వినోద్ కుమార్ సహాయపడ్డారు.



ఎక్కటి శిల్పంలో శాసనాన్ని చూపిస్తున్న పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రుణాలు ఇప్పిస్తామని మోసం చేసిన ముఠా అరెస్టు: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు అధికారులమని చెబుతూ, తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పిస్తామని అమాయక రైతులు, వ్యాపారులను మోసం చేస్తున్న ముఠాలో ఏడుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

◆ నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.26 లక్షలు వసూళ్లు చేసుకున్న వీరి నుంచి రూ.1.20 లక్షల నగదు, రైతుల పాసుపుస్తకాలు, అగ్రిమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నల్గొండ: వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

◆ పెద్దవూర మండలం వెలుగు గూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన పరమేశ్(42), మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతి స్వరూప్(34), నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన షేక్ వజీర్ (40) (ప్రస్తుతం పరారీ), మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన కొండా శ్రీను (40), మిర్యాలగూడ బాలాజీ నగర్‌కు చెందిన గోగుల సురేశ్ (28), మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తి వీరప్పగూడెం గ్రామానికి చెందిన చిలుముల సైదులు (35), పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన పల్లెబోయిన నాగరాజు(32), నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ముప్పిడి సైదులు (35) ఓ ముఠాగా ఏర్పడ్డారు.

◆ బ్యాంకు అధికారులు, ఫీల్డ్ ఆఫీసర్లు, రుణాలు ఇప్పించే వారిగా కొద్ది రోజుల నుంచి జిల్లాలో ఏడు మండలాలకు చెందిన 28 మంది రైతుల నుంచి రూ.26 లక్షల వరకు వసూళ్లు చేశారు. బాధితుల ఫిర్యాదుతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్సై వీరబాబు పాల్గొన్నారు.

ఇద్దరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆలేరు, న్యూస్‌టుడే: మారణాయుధాలు కలిగి ఉండి పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారని ఆలేరు ఎస్సై పి.రజనీకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కొత్త పాల్వంచకు చెందిన వనపాకుల రాంబాబు అలియాస్ ఆజాద్ అలియాస్ ఈశ్వర్(35), వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అలియాస్ రాము(38) తుపాకీ(పిస్టల్)తో ఇతరులను బెదిరిస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. 2011లో ఆలేరు శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన క్రమంలో పట్టుబడ్డారు. ఇద్దరి నుంచి రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు కానిస్టేబుల్ డి.స్వామి కేసు ట్రయల్ నడిపించారు.

గంజాయి పట్టివేత!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రాచకొండ ఎస్వోటీ పోలీసులు పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కిన నిందితులు మహారాష్ట్రకు చెందిన వారే. సుమారు 54 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారు సీట్ల కింద దాచి రహస్యంగా తరలిస్తున్న సమాచారం పోలీసులకు అందింది. ఎస్వోటీ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద కాపు కాసి గంజాయిని, నిందితులను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. చౌటుప్పల్ పోలీసులు నిందితుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. గంజాయి కేసు వివరాలను మంగళవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు జాగ్రత్త

బీబీనగర్, న్యూస్‌టుడే: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే చర్యలు తప్పవని బీబీనగర్ ఎస్సై రమేష్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పోచంపల్లి కూడలిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. హెల్మెట్, నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు.


బీబీనగర్‌లో హెల్మెట్ లేకుండా వెళ్తున్న యువకుడిని ఆపి తనిఖీ చేస్తున్న ఎస్సై రమేష్

❐ తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా ఇటీవల దొంగతనాలు జరుగుతున్నాయని గుర్తించామని, పండగలకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రమేష్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆటోకు మైకు బిగించి తిరుగుతూ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇళ్లలో విలువైన ఆభరణాలు, నగదు, వస్తువులు పెట్టి ఇంటికి తాళం వేసి వెళ్లరాదన్నారు. పర్వదినాలకు ఇళ్లకు తాళంవేసి వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

మట్టి రోడ్లు... రాకపోకలకు ఇక్కట్లు..!


హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షం నీటికి కయ్య కొట్టిన మట్టి రోడ్డు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణ శివారు వార్డుల్లోని మట్టి రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం, వరద నీటితో గండ్లు పడ్డాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. హౌసింగ్ బోర్డు, అర్బన్, ఇందిరమ్మ కాలనీలు, బీఎన్ తిమ్మాపురం నిర్వాసితుల కాలనీల్లోని మట్టి రోడ్లు గుంతలమయంగా మారాయి. అత్యధిక నిధులు అభివృద్ధి చెందిన వార్డుల్లోని అంతర్గత రోడ్ల నిర్మాణాలకు కేటాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పురపాలకులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి డీఈ కొండల్‌రావును వివరణ కోరగా మట్టి రోడ్ల సమస్యలు పరిశీలించి నిధుల లభ్యతను బట్టి మరమ్మతులు చేపడతామని వివరించారు.


ఇందిరమ్మ కాలనీలోని అంతర్గత రోడ్డు దుస్థితి


బీఎన్ తిమ్మాపురం నిర్వాసితుల కాలనీలో గుంతల మయంగా..

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న మంచి నీటి పైప్‌లైన్ లీకై నీరు కలుషితమవుతోంది. – శ్రీనివాస్, బొమ్మలరామారం

✔ గ్రామ సిబ్బందికి తెలిపి మరమ్మతులు చేయిస్తాం. – పద్మజ, పంచాయతీ కార్యదర్శి, బొమ్మలరామారం

కార్మికుల ఉపాధి దెబ్బతీయొద్దు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: పురుగుల సాకుతో భువనగిరి పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు బియ్యం రవాణా చేసే హమాలీ కార్మికుల ఉపాధి దెబ్బతీయొద్దని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట హమాలీ కార్మికులతో కలిసి సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. బియ్యం దిగుమతిపై మార్కెటింగ్‌శాఖ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ హన్మంత్ కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి

భువనగిరి గంజ్: గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు దసరా పండుగలోపు చెల్లించి మల్టీపర్పస్


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. పొట్ట యాదమ్మ, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో సమర్పించిన వివిధ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హన్మంత్ కే.జెండగే ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 39 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖ 20, జిల్లా పంచాయతీ అధికారి 7, డీఈఈ హౌసింగ్, జిల్లా ఎంప్లాయిమెంట్, విద్యా శాఖ, చేనేత శాఖలకు సంబంధించి రెండు చొప్పున, శిశు సంక్షేమ, నీటిపారుదల, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్తుల సమస్యలపై ఒక్కో దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్, జడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏవో జగన్మోహనప్రసాద్, సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.


ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, గంగాధర్

ఆలేరుకు గోదావరి జలాల ఘనత కేసీఆర్‌దే

ఆలేరు, న్యూస్‌టుడే: గోదావరి జలాలను ఆలేరు నియోజకవర్గానికి సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దేనని భారాస మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సాగునీటి పనుల ప్రగతిని కొందరు కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. 2020లోనే కాళేశ్వరం(గోదావరి) జలాలతో గంధమల్ల చెరువును నింపారని, దాంతో ఆలేరు వాగు ప్రవహించిందనే నిజాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశం, కిష్టయ్య, రాములు, రాంనర్సయ్య, హరినాథ, శంకర్, వెంకటేశ్, పాండరి తదితరులున్నారు.


మాట్లాడుతున్న భారాస మండల అధ్యక్షుడు శ్రీనివాస్

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా పోచంపల్లి అర్బన్ బ్యాంక్ కృషి చేస్తుందని ఛైర్మన్ తడ్క రమేష్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఇటీవల మృతిచెందిన కప్పెర వెంకటయ్య, మహేశ్వరం దత్తాత్రేయ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మంజూరైన బీమా చెక్కులను అందజేశారు.

శ్రీచక్రాలకు ద్రవ్య సమర్పణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శివశక్తి షిరిడీసాయి అనుగ్రహ మహాపీఠంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మహర్షి కుటుంబ సభ్యులు నాలుగు శ్రీచక్రాలకు ద్రవ్య సమర్పణ చేసి యంత్ర, శ్రీచక్ర ప్రతిష్ఠ జరిపారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఇజ్రాయెల్ దాడులను ఖండించాలి


భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను భారత్ ముక్తకంఠంతో ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏశాల అశోక్ పేర్కొన్నారు. దాడులను వ్యతిరేకిస్తూ భువనగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శాంతికుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శిగా పుట్ట రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, మల్లేషం, సత్తయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

❐ అమెరికన్ సామ్రాజ్యవాదం అండతోనే ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడుల చేస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్లుపల్లి అనురాధ అన్నారు. భువనగిరిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి నర్సింహ్మా పాల్గొన్నారు.

ఆలేరు: లెబనాన్, పాలస్తీనా(గాజా)పై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ సోమవారం ఆలేరులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాఫ్రంట్ జిల్లా కమిటీల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం జరిగింది. ఆర్. జనార్దన్, కె.అడవయ్య, ఉప్పలయ్య తదితరులున్నారు.

ఆరు నెలల్లో బునాదిగాని కాల్వ ద్వారా నీరు

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: సుదీర్ఘకాలంగా నిర్మాణం పూర్తికాని బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేసి ఆత్మకూరు మండలంలోని చెరువులు నింపి సాగు నీరు అందిస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆత్మకూరు మండలం పారుపల్లి, గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై ఉన్న చెక్ డ్యాం వద్ద గోదావరి జలాలకు సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బునాదిగాని కాల్వ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నాయకులు వై. లక్ష్మారెడ్డి, మంగమ్మ, కె.నరేందర్ గుప్తా, ప్యాక్స్ ఛైర్మన్ జి.శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, జె.నగేశ్, కె.అనంతరెడ్డి, డి.నర్సింహాచారి పాల్గొన్నారు.


పారుపల్లి వద్ద బిక్కేరు వాగులో గోదావరి జలాలకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు

సదస్సు జయప్రదం చేయండి

భువనగిరి నేరవిభాగం: కల్లుగీత కార్మికులను పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, వారి సంక్షేమ కోసం నిధులు కేటాయించడం లేదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు ఆరోపించారు. భువనగిరిలో వైఎస్‌ఆర్‌గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో ఈనెల 18న నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, రాజయ్య, ఆంజనేయులు, బిక్షం, వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు

కుటుంబ కలహాలతో ఒకరి బలవన్మరణం

బీబీనగర్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన జీరిగే సునీల్ కుమార్(34) బీబీనగర్‌లో స్థిరపడి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్న సునీల్‌కుమార్ ఆదివారం ఇందిరమ్మకాలనీలోని తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి అన్న సంజీవ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

గుండాల, న్యూస్‌టుడే: మండలంలోని మాసాన్‌పల్లికి చెందిన వృద్ధుడు కెమిడి పెద్ద బీరయయ్య(76) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన బీరయ్య మోత్కూరుకు వెళ్లి అక్కడి నుంచి ఉప్పల్‌లో ఉన్న తన చిన్న కూతురు వద్దకు వెళ్తానని పక్క ఇంటి వారికి చెప్పి బస్సు ఎక్కాడు. నాటి నుంచి ఉప్పల్‌కు చేరుకోలేదు. బంధువులను విచారించినా ఆచూకీ లభించక పోవడంతో కోడలు కెమిడి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జి.సైదులు తెలిపారు.

గుట్టలో గుర్తుతెలియని మృతదేహం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మృతదేహం కుళ్లిన స్థితిలో సోమవారం యాదగిరిగుట్టలో పోలీసులకు లభ్యమైంది. సీఐ రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని నల్లచెరువులో శవం తేలి కనిపించడంతో స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పుర సిబ్బంది సాయంతో శవాన్ని బయటకు తీసి విచారణ జరిపారు. ఎడమ చేతిపై ఎమ్మెల్యే అని పచ్చబొట్టు, రెండు చెవులకు రింగులు, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వయస్సు 45 ఏళ్ల లోపు ఉండవచ్చని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి శవాన్ని శవపంచనామా నిమిత్తం భువనగిరిలోని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లుగా పేర్కొన్నారు.

కబేళాకు తరలిస్తున్న గోవుల వాహనం పట్టివేత

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం లక్కారం వద్ద బొలెరో వాహనంలో కబేళాకు తరలిస్తున్న గోవులను, ఎద్దులను సోమవారం ఉదయం పట్టుకొని కేసు నమోదు చేసినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. ఏపీలోని కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ నుంచి 14 ఆవులు, 4 ఎద్దులు కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలం దేవవరానికి చెందిన బొలెరో డ్రైవర్ బత్తుల గోపి, కోన తాటాబ్బాయిపై ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మండలంలోని నాతాళ్లగూడెం గ్రామ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన నాగు కిష్టయ్య వ్యక్తిగత పని మీద ద్విచక్రవాహనంపై భువనగిరికి వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వలిగొండ మండలం నాతాళ్లగూడెం వద్ద అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వలిగొండలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

వలిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని మునగాలతుర్కపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 2006-07లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకొన్నారు. నాటి గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



అపూర్వ సమ్మేళనంలో మునగాలతుర్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సాగు నీరు అందించండి: సీపీఐ

వలిగొండ: రైతులకు సాగు, తాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. వేములకొండ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేయడానికి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో యానాల దామోదర్‌రెడ్డి, బోడ సుదర్శన్, పోలేపాక యాదయ్య, సలిగంజి వీరస్వామి ఎల్లంకి మహేశ్, సత్యాద్రి రవీందర్, పులిపలుపుల మల్లేశ్, బాలగోని సత్యనారాయణ పాల్గొన్నారు.

వంతెన తొలగించాలని వినతి.. యాదగిరిగుట్ట పట్టణం: పట్టణంలో గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన వంతెన నిర్మాణం స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందని, దీనిని తొలగించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఆ పార్టీ శ్రేణులు కలిసి సోమవారం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసి వినతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ , బండి జంగమ్మ, మండల కార్యదర్శి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

భూముల కొనుగోలుపై విచారణ

రాజపేట, న్యూస్‌టుడే : బేగంపేట గ్రామంలోని 216 సర్వే నెంబరులో ఓ కంపెనీ పేరుతో అక్రమంగా నిర్మాణం జరుగుతుందని గ్రామస్థుల ఫిర్యాదు చేయగా పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తహసీల్దారు దామోదర్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సర్వే నెంబరు స్థలంలో సుమారు 530 ఎకరాలుండగా సుమారు 140 ఎకరాలు గ్రామస్థుల నుంచి ఇదే కంపెనీవారు కొనుగోలు చేశారని తెలిసింది. మిగతా 200 ఎకరాల స్థలాన్ని అక్రమంగా కొనుగోలు చేయాలనే కాంక్షతో సదరు స్థలం దారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, తమకు తక్కువ ధరకు విక్రయించాలని బెదిరిస్తున్నారని గ్రామస్థులు వారికి వివరించారు. ఈ విషయమై రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టే వరకు పనులను నిలిపివేయించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తహసీల్దారు కోరారు. విచారణ అనంతరం చర్యలు తీసుకోవాలన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

బీబీనగర్: రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్‌షిప్ కార్డులను ఆయన చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సొసైటీ జిల్లా కమిటీ డైరెక్టర్ హమీద్‌పాషా, అనిల్ కుమార్, ఉషాకిరణ్, శివాజీ, మహేష్ పాల్గొన్నారు.

ముస్లింల భారీ నిరసన ప్రదర్శన

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఐకాస నాయకులు మహ్మద్ అథర్, మత పెద్ద ముఫ్తి అజ్‌హర్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి దూత, మహ్మద్ ప్రవక్త ముస్లింలకు ఆరాధ్య దైవమని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుంచి 28 వరకు ఉన్న మత స్వేచ్ఛను, ఆచారాలను హరించే విధంగా దేశంలో కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ తరహా చర్యలకు పాల్పడుతున్న వ్యక్తులను సుప్రీం కోర్టు కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా తౌసిఫ్, మౌలానా ఫెరోజ్, ఐకాస నాయకులు ముఫ్తి ఆజ్‌హర్, ఇమాద్, హాఫీజ్ సాజిద్, ఇబ్రాహీం, సలావొద్దీన్, మజ్‌హర్, షేక్ మీరా, అమీన్ మెమన్, ఆబిద్ అలీ, జలీల్, ఇంతియాజ్, యూనుస్, రహీం, సిరాజ్, సల్మాన్, అహ్మద్, సమీర్, ముజాహిద్, జాకిర్ పాల్గొన్నారు.


భువనగిరిలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ముస్లింలు

తండాల్లో భాజపా బలోపేతానికి కృషి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: సబ్బండ వర్గాల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ పిలుపు ఇచ్చారు. మండల కేంద్రంలో సోమవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తండాలు, గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, భాజపా మండల అధ్యక్షుడు బానోతు శత్రునాయక్, రామ్‌నాయక్, శ్రీనునాయక్, నరేందర్‌నాయక్, నరేశ్‌నాయక్, లక్ష్మీనారాయణ గౌడ్, భాస్కర్, సాయికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


తుర్కపల్లిలో భాజపా సభ్యత్వ నమోదు చేయిస్తున్న గిరిజన మోర్చా నాయకులు

అవీ ఇవీ

బాధ్యతల స్వీకరణ.. భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండల తహసీల్దార్‌గా మందడి మహేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శ్రీకాంత్‌రెడ్డి భువనగిరి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆయన ఘనంగా వీడ్కోలు పలికారు. డీటీ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.



నిత్యావసరాల పంపిణీ.. వలిగొండ: మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గంగదారి భిక్షపతి, ఎరుకల ఎల్లమ్మ, బండారి మీనమ్మ, గంగదారి ఇస్తారి, దబ్బ పాపమ్మ, గంగదారి నర్సమ్మ, రేపాక కమలమ్మ, దొడ్డి నర్సమ్మ, పాల్వంచ మల్లమ్మ అనే వృద్ధులకు ఏజేఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి నిత్యావసర సరకులను సోమవారం పంపిణీ చేశారు.

తేనెటీగల దాడి.. రామన్నపేట: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ మృతి చెందగా ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు శ్మశాన వాటిక వద్దకు వచ్చారు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. బంధువులు పరుగులు తీశారు. తేనె టీగల దాడిలో పలువురు అస్వస్థతకు గురి కాగా వీరిలో కొందరు రామన్నపేట ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

శ్రమదానం... రామన్నపేట: దుబ్బాకలో సీపీఎం నాయకులు సోమవారం శ్రమదానం చేశారు. దుబ్బాక, రామన్నపేట మధ్య ప్రధాన రహదారికిరువైపులా కంప చెట్లను తొలగించారు. మేడి గణేశ్, గుండాల ప్రసాద్, గట్టు నర్సింహ, మత్స్యగిరి, శ్రీశైలం పాల్గొన్నారు.

తోటి మిత్రుల ఆర్థికసాయం.. భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని రావుల నాగేష్ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబానికి తోటి స్నేహితులు రూ. 30,500 ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో(2005-06) తరగతి చదువుకున్న విద్యార్థులు చందాలు వేసుకొని బాధిత కుటుంబానికి సాయమందించారు. భోగ సాయికుమార్, పూర్వ విద్యార్థులున్నారు.

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రానికి చెందిన సరిపెల్లి అంజయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆ కాలనీ యువకులు రూ.13,500 నగదు సాయాన్ని సమకూర్చి మృతుని కుటుంబానికి సోమవారం అందజేశారు. కృష్ణకుమార్, ఐలయ్య, నిరంజన్, శివశంకర్, చంద్రశేఖర్, మహేష్, లింగస్వామి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం: యాదగిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితురాలు అరుణ పతి వియోగం అనంతరం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సోమవారం రూ.67 వేలు సాయం అందించారు. తాళ్ల లక్ష్మారెడ్డి, గడ్డమీది మాధవులు, వెంకటేష్, కిషన్, నర్సింహ, సత్యనారాయణ, మల్లేశ్, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ.. సంస్థాన్‌నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామానికి వాసవి క్లబ్ (నల్గొండ) ఆధ్వర్యంలో గజవెల్లి సావిత్రమ్మ కుటుంబం సహకారంతో 11 సిమెంటు బెంచీలను బహూకరించారు. వాసవి క్లబ్ నల్గొండ జిల్లా గవర్నర్ రాచర్ల కరుణాకర్ సోమవారం ప్రారంభించారు.

అమ్మలకు అలంకారం.. తరించిన భక్తజనం



జయలక్ష్మీ దేవీ అలంకరణలో స్వర్ణగిరి పద్మావతి అమ్మవారు

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరిలో దేవీశరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం అమ్మవారికి జయలక్ష్మీ దేవిగా అలంకరించి లక్ష్మీహవనం నిర్వహించారు. భక్తులు జయలక్ష్మీ స్తోత్రాన్ని పఠించారు. సాయంత్రం అమ్మవారిని తిరుమాడవీధుల్లో ఊరేగించారు.

రాజపేట: రఘునాథపురం, రాజపేట గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పూజలు చేశారు. భారాస మండల అధ్యక్షుడు తిరుమలేశ్, నాయకులు పాల్గొన్నారు.

మోటకొండూరు: హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఐదోరోజు మహా చండీమాతగా అమ్మవారు దర్శనమిచ్చారు.

బీబీనగర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారు మహాకాళి అవతారంలో దర్శనమిచ్చారు. హోమం నిర్వహించగా.. దీక్షాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, పొట్టోళ్ల శ్యామ్‌గౌడ్, గోలి పింగళిరెడ్డి, ఎస్ఐ రమేష్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేశారు.

వలిగొండ: వలిగొండ శ్రీహరిహర త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు లలితాదేవి రూపంలో పూజందుకున్నారు.

బొమ్మలరామారం: శివయువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని మహాచండిదేవిగా అలంకరించారు.


బీబీనగర్: ప్రముఖులను సత్కరించి జ్ఞాపికలను అందజేసిన ఉత్సవ కమిటీ సభ్యులు


రఘునాథపురంలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

రామన్నపేట : బోగారంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహం వద్ద మహాచండీ హోమం నిర్వహించారు. గోగు హరిప్రసాద్, స్వరూప పాల్గొన్నారు.

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని మార్కండేయ దేవాలయంలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గాదేవి దర్శనమిచ్చారు. అమ్మవారికి చేనేత పట్టుచీరను సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి సోమవారం మహాచండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

❐ మహాచండీదేవికి పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కౌన్సిలర్ శైలజ పూజలు నిర్వహించారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో, అన్నపూర్ణేశ్వరిస్వామి ఆలయంలో దుర్గామాతను పలువురు నాయకులు దర్శించుకున్నారు. పుట్టపాక గ్రామంలో అన్నప్రసాదం వితరణ జరిగింది.

యాదాద్రి మాడవీధిలో పాము కలకలం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్తర రాజగోపురం వెనక లిఫ్టనకు వెళ్లేదారి తొలిమాడవీధిలో సోమవారం రాత్రి నాగుపాము కనిపించింది. అప్రమత్తమైన ఎస్పీఎఫ్ సిబ్బంది పాములు పట్టేవారిని పిలిపించి ఆలయంలోకి వెళ్లకుండా పట్టుకున్నారు. అనంతరం అడవిలో వదిలారు. రాత్రి 9:30 గంటలకు ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.